# ముష్టి నిజం

రైళ్ళు ఆలస్యంగా వొస్తున్నాయని, ప్రభుత్వానికి ఫిర్యాదు చెయ్యడం, పత్రికలకి వ్రాయడం, చాలామందికి ఈ రోజుల్లో పరిపాటైపోయింది. వీరి మొర ఆలకించే కాబోలు, ఆలస్యమవకుండా అతివేగంగా నడిచే రైళ్ళని కొన్నింటిని ప్రభుత్వం నడుపుతోంది. ఈ రైలు, కాస్తంత ఆలస్యంగా వొస్తే బాగుండున్రా బాబూ అనుకొనే సందర్భాలు నే నెరుగుదును. మనలో చాలామందికి చివరి ఘడియల వరకూ తెమలని స్వభావం. తరతరాలుగా వొస్తున్న ఆధ్యాత్మిక చింతన ఇందుకు ఎంతవరకూ కారణమో నే చెప్పలేను. దీనికి "ఈరైలు టైముకి వొచ్చేసిందేమిటి!" అన్న ధీమా జోడైంది. భారతీయులు ఉదారస్వభావులు; దయాదాక్షిణ్యాలు కలవారు. టికెట్టుకొనే టైములేక; బెడ్డింగ్ నెత్తినెట్టుకుని కదిలిపోతున్న ఇంజెన్‌వైపు పరుగెడుతుంటే గమనించిన ఇంజెన్ డ్రైవరూ, గార్డూ, కనికరించి రైలుని ఆపుచెయ్యరా ఏమిటి!

ఆ స్టేషన్‌లో వొకరైలు దిగి మరో రైలెక్కాలి. ఎక్కవలసిన రెండో రైలు పదినిమిషాల్లో వొచ్చేస్తుంది. బ్రిడ్జి మీదుగా వెళ్ళి అవతల ప్లాట్‌ఫారమ్ చేరుకుంటే కాని మంచి కాఫీ దొరకదు. ఒక్క పావుగంట ఆలస్యంగా వొస్తే బాగుండును రైలు. పావుగంటంటే నాకు భయం. ఓ కథ జ్ఞాపకం వొస్తోంది. ఒకరోజు వొక స్టేషన్‌కి పావుగంట ఆలస్యంగా ఒచ్చిందిట రైలు. "ఏమిటండీ రోజూ గంట ఆలస్యంగా వొచ్చేది, యీ వేళ పావుగంట ఆలస్యంలో సరిపెట్టుకుందే" అని ప్లాట్‌ఫారమ్‌పై నిరీక్షిస్తున్న యాత్రికులు ప్రశంసించారట. "ఎబ్బె ఇది నిన్నటి రైలు" అన్నారుట. అల్లాంటి పావుగంట కాదనుకోండి. నే కోరిన ఆలస్యం బ్రిడ్జిదాటి కాఫీ తాగి రావాలి; వేలైతే అక్కడి స్టాల్‌లో వున్న పుస్తకాలు, పత్రికలు చూడాలి. వీనికి తగినంత ఆలస్యంగా వొస్తే చాలు. ఇంకేమీ అడగను,

నా ప్రార్థన వృథాపోలేదు. రైలుగంట ఆలస్యంగా వొస్తుందని ప్రకటించారు. అల్లాంటప్పుడే దేముడున్నాడనుకుంటూవుంటాం. అమ్మయ్య అనుకుని బ్రిడ్జిదాటి అవతల ప్లాట్‌ఫరమ్ చేరుకున్నాను. కాఫీ పుచ్చుకోడం ఐంది. రైలు ఆలస్యంగా వొస్తుందని తెలిసి గాబోలు, పుస్తకాల స్టాల్‌వాడు కర్ర దుకాణం తెరవలేదు. ప్లాట్‌ఫారమ్ పై పచార్లు సాగించాను. ప్లాట్‌ఫారంలో నేను ఉంటుందనుకున్నంత అలజడి లేదు. ఉదయం తొమ్మిది కావొస్తున్నా, సూర్యుడు కూడా ఆకాశంలో బద్ధకంగా కదుల్తున్నాడు. మేఘాలు రెండుమూడు, ఒళ్ళు విరుచుకుంటూ ఒకమూల పడివున్నాయి ప్లాట్‌ఫారమ్‌పై చెత్తాచెదారం తుడిచి బాగుచేస్తున్నారు. ఎర్రగా దుమ్ము, టీ దుకాణం పొగతో కలిసి, పైకి ఏ దిక్కున పోవాలో తెలియక మనుషుల్నే కవ్విస్తోంది. నలుగురైదుగురు పక్కలు సర్దుకుంటున్నారు. ధైర్యం చేసుకుని కొన్ని కాకులు, తింటున్నవారి చుట్టూ మూగుతున్నాయి.

కూలీలు పాగాలు చుట్టుకుంటున్నారు. టిక్కట్లాయన టీ త్రాగుతున్నాడు. నే దిగిన రైల్లో ఎరుగున్న నాలుగైదు మొహాలు, దేన్నో వెదుకుతూ తిరుగుతున్నాయి. ప్లాట్‌ఫారమ్‌పై జనం ఒక బుల్లి ప్రపంచం. మనిషి దుస్తులు, వైఖరిని బట్టి ఎవరెవరు, ఏ ఏ పనిలో వారో ఊహించడంతో కాలక్షేపమైపోయింది. ఆ ఎర్ర పాగా ఆయన, పుగాకు వ్యాపారి; బుష్ కోటబ్బాయి, కాలేజీ విద్యార్థి, దిగులుగావున్న వ్యక్తి .... జబ్బుగా వున్న స్త్రీ భర్త, నాతో రైలు దిగిన దంపతులే. ఆ మాసినకోటు ఆసామీ, కోర్టు గబ్బిలం; పంచికట్టు, పొడుగు చేతుల చొక్కా సంచిలో మణిచి బెల్టు బిగించినాయన క్లార్కు, బోయ్‌మంటూ నా ముందుగా నాలుగు కుక్కలు, ఒకదాన్ని ఒకటి తరుముకుంటూ వెడుతున్నాయి. ఆ ముందుది ఆడది కాబోలు, వెనక తరుముతున్న వాటిని తప్పించుకుని పరుగెడుతూంది. వెనకబడ్డ రెండుకుక్కలూ, కొట్లాడుకుంటూ, బలాబలాలు తేల్చుకోడానికి మరో దిక్కున పోతున్నాయి. ఇంకా పుస్తకాల స్టాల్ తెరవలేదు. ప్లాట్‌ఫారమ్ దాటి డివరకొచ్చేశాను... దక్షిణపు దిక్కు. కాస్త దూరంగా చెట్లున్నాయి. దానికింద ఏదో తింటూ కూర్చున్నాడు ముష్టివాడు. ఖాళీ అయిన గోని నంచీ పరుచుకున్నాడు. ఏదో తాగుతున్నాడు, అల్యూమినియమ్ గ్లాసుతో, టీ నీళ్ళు. ఇటు తిరిగాడు. అవును, ఇందాక నాతో రైల్లో దిగిన ముష్టాడే వాడి హెడ్‌క్వార్టర్స్ ఈ ప్లాట్‌ఫారమ్ చివరి చెట్టు అవును వాడే. వయస్సు యాభై వుండొచ్చు. నెరిసి ఎడమెడంగా వూడుతూ, వుంటూ ఎదిగిన గెడ్డం... కళ్ళు సన్నం, కాని చూపు తీక్షణం; నెత్తిన పాగా; మోకాళ్ళ మీదకి లాగి మడిచి కట్టిన సంచీ, పైన కంతలు కుట్టిన తువ్వాలు, మనిషి మనిషి దగ్గరకూ వొచ్చి వికృతంగా విన్యాసం చేసి, మొహం అదోలా పెట్టి యాచించలేదు. ఒకటి రెండు పాటలు పాడాడు. అవి పాత పాటలే... ఏమి జన్మం, ఏమి జీవితం... ఈ మాయకాయం - అన్నది. రైలు నడుస్తుంటే, పట్టాలమీద పెట్టి చేసేచప్పుడు, వాడి పాటకి లయ, క్రమం ఇచ్చి, దీనమైన వాతావరణాన్ని నెలకొల్పుతుంది. వాడు పాడిన కాసేపు, రైల్లో మాట్లాడుకునే బృందం మాటలు నిలుపుజేస్తారు; ఇంతేకదా జీవితం అనుకుంటారు. ఈ శరీరం, ఈ సంపద, ఈ సుఖాలు. అన్నీ మాయ. ఇందులో ఏ ఒక్కటీ మనతో రాదు. ఎందుకీ తాపత్రయం ఉన్నదాంట్లో కాస్త ఈ ముష్టిడికిస్తే నేం? అంతా తలోపైసా పడేస్తారు యాత్రికులు, పైసాలు, చిల్లరవుంటే సరే; లేనివారికి చిల్లర వాడే ఇస్తాడు. వాడి వద్దనుండి చిల్లర తీసుకోడం కొందరికి చిన్నతనంగా వుంటుంది ఎందుకో, నాకూ అంతే. పదిపైసల బిళ్ళ పడేశాను. ఇచ్చినదికాస్తా పుచ్చుగుని, పాట నిలుపుచేసి, తలుపుదగ్గరికిపోయి నిలబడతాడు వీడు. కొందరల్లాకాదు. ఇవ్వకపోతే, "ఎందుకివ్వరూ? మీరివన్నీ మూటగట్టుకుపోతారా? ఇదంతా శాశ్వత మనుకుంటున్నారా?" మొదలైన ప్రశ్నలు... చిత్రగుప్తుడు అడగవల్సినవి... అడిగేసి, రొకాయించి, యమధర్మరాజు ప్రతినిధికిమల్లే వేధించుకుతింటారు.

వీడల్లాకాదు. ముష్టివాళ్ళల్లో కాస్తంత పెద్ద మనిషి. నిరుద్యోగం, బీదతనం లేకుండా రూపులేకుండా మాపేస్తామని ప్రభుత్వాలు కంకణం కట్టుకు కూర్చుంటాయని నే నెరుగుదును. ఐనా, ఇట్లాంటి ముష్టివాళ్ళు సమాజంలో కొందరుండాలంటారు. వాళ్ళ వల్ల ఏ ఉపకారం జరిగినా జరక్కపోయినా, ఇతరులు తమ ఆధిక్యతను ప్రకటించు

కునేందుకు వీరు ఉపకరిస్తారు. కోడలు ముష్టి వెయ్యనంటే, ఆ ముష్టాడిని వెనక్కి పిలిచి, "వెయ్యననేందుకు అదెవత్తి - ఈ ఇంటి యజమానురాల్ని నేను - నే వెయ్యను పో" అన్న అత్తగారి అధికార సామ్రాజ్యంలో ప్రథమ పౌరుడు ముష్టివాడు. టెలిఫోను డైరెక్టరీలో వాడిపేరు వెయ్యనక్కరలేదు. ప్రపంచంలో ముష్టివాళ్ళ జాబితా వేస్తే, ఇందువల్ల ఎన్నివేల రీముల కాగితాలు, అచ్చు అక్షరాలు, పొదుపు చేసుకుంటున్నామో, భోగట్టాలేదు. వాడు నమస్కారం పెడితే, మనం తిరిగి నమస్కారం పెట్టనక్కరలేదు. ఆలయానికెళ్ళినప్పుడుగాని దైవం గురించి పట్టించుగోని జనంలో కాస్తో కూస్తో ఆధ్యాత్మిక చింతన కలగజేస్తాడు వీడు ఏమి జన్మం? ఏమి జీవితం? మనం అడగవల్సిన ప్రశ్నలు వీడే అడుగుతాడు. ఆ మాయకాయంలో, ఈ ముష్టివాడు, చెట్టుక్రింద కూర్చుని టీ పోస్తున్నాడు. నాకేసి తిరిగి చూశాడు. వాడే - ఇందాక రైల్లో నాతోబాటు దిగినవాడే. సన్నటి కళ్ళు, తీక్షణమైన చూపు అన్నాను. అది పొరబాటు. మళ్ళా చూశాను. అవును మరి ముష్టాడి మొహంకేసి మనం చూడం. చూడకుండా వాణ్ణి తప్పించుకునేందుకు, వొక పైసా పడేసి మరోచోటికి పొమ్మంటాం. వాడి మొహంకేసి చూస్తే, ఏ అంగవైకల్యమో కంటబడుతుందన్న భయం. ముక్కో, చెవో, కన్నో, ఏదో సరిగ్గా వుండదు. ఇట్లాంటివి చూసి, తనూ ఇట్లా గడుపుతాడన్న భయంతో, ఇలా అవకుండా ఏదన్నా మంత్రమో, మందో కనుక్కుందామనే బుద్ధుడు, భార్యతో చెప్పకుండా ఇంట్లోంచి పారిపొయ్యాడు. ఈసారి సరిగ్గా చూశాను. ఒక కన్ను సరిగ్గాలేదు. ఏదో పొరకమ్మి, ఆ సందులోంచి, తెల్ల తెల్లగా కనబడుతూంది. వాడు నన్ను చూశాడు. లేచాడు. పాగా సర్దుకున్నాడు. గోనిసంచీ మడిచేసి లుంగీచుట్టి, చెట్టు మొదట్లో వుంచి, నాకేసి నడుస్తున్నాడు. నాకు భయమేసింది. మళ్ళా వొచ్చి పట్టుగుంటాడా ఏమిటి? ఇందాకనేగా రైల్లో పదిపైసల బిళ్ళ పడేశాను. అప్పుడే మరిచిపొయ్యాడా? అడిగినవాణ్ణే మళ్ళా అడుగుతాడా? యిలా ఇచ్చుకోడం మొదలెడితే, దీనికి అంతంటూ వుందా? నేను లక్షాధికారినా? దానాలు చేస్తే, నేనూ వాడిలాగైపోనూ? ఇంకా దగ్గరగా వొస్తున్నాడు. మళ్ళా పాట మొదలెడతాడా? అర్భకుడు - పాడేందుకు వాడికి ఓపిగ ఎక్కడిది? వాడిమీదుగా, యుగ యుగాల నాగరికతలు నడిచి వెళ్ళాయి. గుండెకి ఇరువైపులా వున్న ఆ ఎముకలు, ప్రేగులు నాగరికత నడిచెళ్ళిన జాడలు, నీళ్ళన్నీతోడేశాక ఎండిపోయిన రాయలసీమ నుయ్యి వాడి నేత్రం; యుద్ధాలన్నీ ముగిసి, ఫిరంగుల మోత సమసిపొయ్యాక, మిగిలిన నిశ్శబ్దం వాడి కంఠం. ఇంకేం పాడుతాడులే!

అడుగో కుంటుతున్నాడు. ఇదివరలో నేను గమనించలేదు. కాలి మడమలో ఏదో లోపం. కుంటుతాడు. నిజంగా కుంటివాడా? లేక ఇదంతా నటనా? కుంటే. నటించిన కుంటి వేరుగా వుంటుంది - రంగస్థలంపై చనిపోయినట్లు పడున్న పాత్ర వేగిరపాటుతో ఊపిరి తీస్తున్నట్టు. నాకెందుకు ఈ వేదన! వాడు నన్ను యాచించకుండా, నా ముందునుంచి నడిచిపోతాడేమో! నన్ను గుర్తుపట్టి ఇందాక ఇచ్చిన "మారాజే" ననుకుని వెళ్లిపోకూడదూ! నాకు నమ్మకంలేదు. మనం వాడి మొహం ఎలా చూడమో, వాడూ మన మొహంకేసి చూడడు. వాడు చూసేది మన చొక్కా జేబుల కేసి, చేతులకేసి. చుట్టూ జనం వుండగా, ముష్టాడు తటస్థపడితే, మరొకరు చూసుకుంటారులే, అని తప్పించు

కోవచ్చు. కాని ఒంటిగా ఉన్నప్పుడు అలా సమర్థించుకుని, వాణ్ణి వొదుల్చుకోడం కష్టం. కాబట్టి అక్కడి నుండి దూరంగా వెళ్ళి, జనంలో కలిసిపోవడం మంచిది. ప్రజాస్వామ్యములో ప్రబలేవి గుంపులు. ఆ గుంపులో కలిసిపోవాలి. లేచి ఉత్తరంవైపు ప్లాట్‌ఫారమ్ మీదికి నడవడం సాగించాను. పుస్తకాల స్టాల్‌వాడొచ్చాడు. తలుపు తెరిచే తతంగం జరుపుతున్నాడు. మళ్ళా కాఫీ హోటల్‌లోకి జారుకోనా? ఆ కాఫీ డబ్బువాడికే ఇవ్వొచ్చుగా. ఎందుకు నాకీ పిరికితనం అటూ ఇటూ చూసి బెదరక తిన్నగా నడుచుకుంటూ వెళ్ళి ప్లాట్‌ఫారమ్ చివర– ఉత్తర దిక్కుకు చేరుకున్నాను టిక్కట్లాయన ఎదురయ్యాడు. రైలు ఎప్పుడొస్తుందని అడిగాను. మరో అరగంట ఆలస్యమయ్యేటట్లుంది అన్నాడు. నా గుండె జారింది. పావుగంట, అరగంట – మహా అయితే గంట – ఆలస్యం సహించగలం – మరో అరగంట– అంటె గంటన్నర. రైలు వొచ్చి, స్టేషన్లో ముస్తాబై వెళ్ళేసరికి మరో అరగంట పట్టదూ. ఇలా ఆలస్యమైతే ప్రయాణీకుల గతేంకాను? ఆ కోర్టు గబ్బిలం కోర్టుకి హాజరవాలి. లేకుంటే కేసు పరాయి పక్షం అవుతుంది. – వాడు ఫకీరవుతాడు. ఆ దంపతుల విషయం చూడండి. భార్యకి జబ్బు. హాస్పిటల్‌లో చేర్పించడానికి తీసుకెడుతున్నాడు. ఆవిడ ప్లాట్‌ఫారమ్ పైననే ప్రాణాలు విడిచేటట్టుంది. సకాలానికి వెళ్ళకపోతే, ఆ విద్యార్థి పరీక్షకి అందుకోలేదు. ఆ క్లార్కు ఆలస్యంగా వెడితే, ఆ పూటకి ఎగేసినట్లు జమ. రైలు ఆలస్యంమైతే ఇన్ని ఇబ్బందులు ఏర్పడతాయి.

అధికారులకు ఫిర్యాదు చెయ్యాలి, పత్రికలకి వ్రాయాలి. నిజమే. ఆలస్యం అవడంవల్ల నాకు జరిగే ప్రమాదం ఏదీలేదు. లేదనుకోడానికి రైలొస్తే, అందులో ఎక్కి, ఈ ముష్టాడి బారినుండి తప్పించుకుని వుందునుకదా. ఇప్పుడు, మరో అరగంట ఇక్కడ గడపాలి. సూర్యుడు మెటికలు విరుస్తూ లేస్తున్నాడు. ఏదో ఇంత మేత వేస్తున్న మేఘాలు కదలడం ప్రారంభించాయి. పోర్టర్లు అటూ ఇటూ తిరుగుతున్నారు. కాకులు ఎగిరి పోతున్నాయి. జనం దేన్నో వెదుకుతూ తిరుగుతున్నారు. ఏదో గంట మోగింది. గుంపులు పరుగులెడుతున్నారు. నే వెళ్ళవల్సిన రైలు రావడం లేదు కద! వెనక్కి తిరిగి చూశాను. ముష్టాడు సరాసరి నా వద్దకే వొస్తున్నాడు. పరమాత్మను మనిషి అన్వేషించడం బదులు, పరమాత్మను మనిషి అన్వేషిస్తున్నట్లు, వెంబడిస్తున్నాడు.

ప్లాట్‌ఫారమ్ దాటాను. అవతల రెండు మూడు చెట్లున్నాయి. వాటికింద పాత రైలుపెట్టి వొకటుంది. దాని కప్పు సరిగ్గాలేదు. తలుపులూవున్నట్టులేవు. అందులో ఎవరోవున్న అలజడైంది. అక్కడొకామె వుంది. బిడ్డని ఆడిస్తోంది. వాలకం, వైఖరీ చూస్తే ముష్టిదిలాగే వుంది. ఆగిపొయ్యాను. నాలుగడుగులు వెనక్కి వేశాను. ఆమె గాభరాపడి లేచింది. చీర సర్దుకుంది. పిల్లవాణ్ణి దగ్గరకు తీసుకుంది. వెనక్కెడితే గొయ్యి, ముందుకెడితో నుయ్యి లాగైంది నా పని.

దక్షిణ దిక్కున వాడు, ఉత్తర దిక్కున ఇది. ఈ ముష్టి వాళ్ళకి "గారు ఆమె" మొదలైన మర్యాదస్తుల పదాలు వాడనక్కర్లేదు. నాకేసి చూస్తుంది. చిరిగిన, ఆకుపచ్చరంగు చీర – ఒళ్ళంతా కప్పిందనలేను, రెవిక లేదు. తైలం ఎరగని జుట్టు, సాలిగూడు దారాలకిమల్లే, జారిన వెంద్రుకలు మినహా, మెలితిప్పి, నెత్తిన కొప్పుగా అమర్చిన జడ.

మొహం అదోలా దీనంగా పెడుతోంది వెనక్కి తిరిగాను. వెనకాల వాడు. దక్షిణం వైపు ముష్టాడు. నన్ను వెంబడించిన పరమాత్మ.

"దానికేమి ఇయ్యమాకండి"

నా దగ్గరగా వొచ్చి, రహస్యంగా చెప్తున్నాడు. దక్షిణ దిక్కు ముష్టివాడు ఉలిక్కిపడ్డాను. వాడి నీడ నా కాళ్ళమీద పడింది - వాడంత పల్చటినీడ. ఒకడుగు వెనక్కివేశాను.

"ఏం, ఎందుకివ్వొద్దు - అని ప్రశ్నించాను, వాడి మొహంకేసి చూడకుండా.

"అది నాది. ఆణ్ణెట్టుకుంది. ఇస్తిరా, ఆడి కిస్తుంది." రైలు ప్రమాదం జరిగి గాయాలు తగిలి, అణిచి అణిచి, ఇంక అణిచే ఓపికలేక, కొన ఊపిరితో, ఆఖరుసారి మూలిగిన యాత్రీకుడి కంఠంలా వుంది వాడి కంఠం.

"వా డెవడు?"

"ఆడ - ఆడే అని అవతల ప్లాట్‌ఫారమ్ వేపు చూపించాడు. అవతల ప్లాట్‌ఫారమ్ మీద, మరేదో రైలొచ్చి నిలిచింది. జనం ఎక్కడం, దిగడం, హడావిడిగా వుంది. ముష్టివాళ్ళ బృందం చీలి, విడివిడిగా, అందరూ తలోపెట్టి కిటికీ ముందూ కాపలాకాసి, వికృతంగా చేతులు, కడుపులు చూపుతూ యాచిస్తున్నారు. దూరంగా గార్డు పెట్టెకి ముందు పెట్టెముందు నిలబడ్డాడు. ఒక ముష్టివాడు వాడికేసి చూపుతున్నాడు. వాడు ఆ పెట్టెలో ఏమీ దొరక్క, బ్రిడ్జి మెట్లముందు నిలబడి జనాన్ని పట్టుకుని అడుగుతున్నాడు. వయసు ముప్పై వుంటుందేమో, కండబలం, పిక్క బలం, గుండ్రటి మెడ. గిరజాల జుట్టుని ఎర్రపాగాలో అమర్చి, హుషారుగా యాచిస్తున్నాడు. వాడిలో ఏ అవకరమూ కనబడలేదు. హాయిగా కూలి పని చేసుకోవచ్చు - ఈ ముష్టి దేనికో! ఏమో మన దేశంలో, దేవుడి పేరిట జనాన్ని రంజింపచేసి, కాయకష్టపడకుండా డబ్బు గడించడం సులువు. పనులు చేసేవాళ్ళూ, ఫలానాపని చెయ్యి - అని చెప్పే వాళ్ళూ - ప్రపంచంలో ఇచ్చేవాళ్ళూ, పుచ్చుకునేవాళ్ళూ, అంతే ఇచ్చినదీ, పుచ్చుకున్నదీ - అంతా దేవుడికే చేరుతుంది.

"నీ పేరేమిటి?" అని ఏదో అర్థంలేని ప్రశ్న అడిగాను.

"గురన్న" ఈ నాటికీ పేరుగల ముష్టాడిని చూడగలిగాను.

"నిన్ను విడచేసి, వాడితో ఉంటుందా - ఏం? ఎందుకు?" అని అడిగాను.

గురన్న నవ్వే యత్నం క్షణం చూశాను. యాచనతో వికృతమైన మొహంలో యాగయాగాల సంస్కృతి పోషణలో హరించిపోయిన, ఒంటి కన్ను ద్రవింపజేసిన ఆ "తడి" నడుమ నవ్వు. నా ప్రశ్నకి సమాధానం లేదు.

"దాని కీమాకండి - ఆడికిస్తుద్ది, నా కివ్వండి." మళ్ళా యాచన మొహం, వికృతంగా పెట్టాడు. అరచెయ్యి చాచాడు. చిత్రం, వాడిచేతికి ఐదు వేళ్ళూ ఉన్నాయి. వాడికాలం వృథాచేశాను ప్రశ్నలతో ఈ సంభాషణ లేకుంటే, ఆ రైలు దగ్గరకెళ్ళి, నాలుగు డబ్బులు గడించుకునేవాడు. ఈ కాలయాపన క్షమించరానిది. అరచేతిలో పావలావుంచాను. విశ్వాన్ని పరమాత్మ, తన అరచేతిలో నొక్కిపట్టి, "లీల" - "కేళి" జరుపుతున్నట్టు పావలాని వాడి చేతులో నొక్కిపెట్టి వేళ్ళు మడిచాడు. చిత్రం, వాడి వేళ్ళు ముడుచుగుంటాయి కూడ.

"దానికేమీ ఇయ్యమాకండి" అవతల ప్లాట్‌ఫారమ్ వైపు మడమ ఎగరేస్తూ పోతున్నాడు గురన్న, గంటకొట్టారు జండా చూపాడు గార్డు. టీ కప్పులు, చిల్లర తీసుకున్నాడు టీ కుర్రాడు. అడ్డమొచ్చిన కుక్కని ఎవరో కర్రతో కొట్టారు. మొర్రోమంటూ అక్కడే నిలబడి, కిందపడ్డం వాటిని ఏరుకు తింటోంది కుక్క. మరో రెండు కుక్కలు కయ్యానికి దిగాయి నడిచే ప్రతివాడూ, వాటిలో ఒకదాన్ని తన్నుతూనే వున్నా - వాటిని కాతరుచేసే స్థితిలో లేవు ఆ కుక్కలు.

నా ముందునుంచే నడుస్తోంది - ఉత్తర దిక్కు ముష్టిది - గురన్న ముద్దుల సతి. కళ్ళూ, జుట్టూ, నడకా, అన్నీ బాగానే వున్నాయి. తెల్లగా మెరిసే పళ్ళు - భుజాన బిడ్డ - గర్భవతి ఆరోమాసమా? నునుపైన నల్లటి శరీరం - గీతలు; చర్మంరేగిన మడతలు - ఏవీ లేవు. నున్నటి వక్షం - పెద్దగా; బరువుగా; ముందు చూపుగలస్థనాలు. శరీరం అంత లావుకాదు; సన్నమే. సన్నటి శరీరం కావడం మూలాన గాబోలు, ఆ పెద్ద స్తనాలు ప్రస్ఫుటంగా కనబడి, వాట్లకేసి చూసేటట్లు, చూపుని గుండ్రంగా తిప్పి తిప్పి నిలిపివేసే, శక్తిగల స్థనాలు, చీరమడతల చుట్టూ - ఆరోమాసమని, కాలమానాన్ని ప్రదర్శిస్తూ - నా ముందుగా వెడుతోంది. ఆమె మీదనుండి కూడా నాగరికత నడిచింది. గుండ్రటి, నునుపైన శరీరంపై చక్రాలు నిలబడక రథం పల్టీకొట్టి, నాగరికత ఓడిపోయింది. ఆమె గెల్చింది. యింకా ఆమెలో నిప్పూ, కామం వున్నాయి; ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్న కుటుంబ నియంత్రణ పథకాన్ని సైతం కాల్చివేసే నిప్పు, నా ముందు నిలబడి చెయ్యి చాస్తుందనుకుని, దర్పంగా, గర్వంగా, భూస్వామితత్వానికి తుదివారసుణ్ణిగా నిలబడ్డాను. పడేస్తాను పావలా... యింకా మాట్లాడితే, అర్ధరూపాయి - ఆ మాటకొస్తే, రూపాయి - ఆడదంటే గౌరవం. వెనకటి శతాబ్దిలో, అది ముష్టిముండ. ఇప్పుడు, బిక్షుకురాలు, బీదరాలు, బిచ్చకత్తె - నాట్యకత్తెకి మల్లె ఆకలితో నర్తిస్తుంది. గురన్న శ్రీమతి - సతీమణి- ఆదర్శ మహిళ, బిచ్చాదేవి - గర్భవతి.

కాని, అది నాముందు నిలబడి యాచించకుండా నడిచివెళ్ళింది. ఆశ్చర్యపడ్డాను. నాలో ఏదో గాయపడింది. యిది తృణీకరణ; అహంభావం. మాటలు తెచ్చుకోని ఉద్రేక సముద్రంలో అలగా, కాకిరెట్టలా కొట్టుకుపోతున్నాను.

గంట మోగింది. కూలీలు పాగాలు చుడుతున్నారు. జనం పరుగులు, ట్రాలీబండ్లు, రోగినిలాగే కుర్చీ, కుండలో నీళ్ళు, టీ బకెట్, చాకలెట్ కుర్రాడు, పత్రికలబ్బాయి, ముసిలాడు ముక్కాడు - ప్లాట్‌ఫారం అంచుమీద నడుస్తున్నారు. యాత్ర ముగిశాక, చివరి పవ్వళింపు ఆ మనుషులగుండా, ఈ బిచ్చకత్తెని వొదిలించుకోడానికి ఏదో చేతులో పడేస్తున్నారు. నవ్వి, సలామెట్టి, మరొకర్ని అడుగుతోంది చిల్లరంతా కొంగులో కట్టి నడుం పక్క చీరమడతలో దోపుతోంది.

నే ఎక్కవల్సిన రైలొచ్చింది. బెడ్డింగు, పెట్టె వెదుక్కుని పోర్టర్ నెత్తిన పెట్టి, చోటుకోసం పెట్టెలు గాలిస్తున్నాను. ఇంజన్ పక్క పెట్టెలో ఖాళీ కనబడుతోంది. కాని అందులో ఎక్కితే ఇంజన్ నెరుసులు, బొగ్గు. ఏదన్నా ప్రమాదం సంభవిస్తే కళేబరం కరువైపోతుంది. ప్రాణంపై తీపి మరి. రెండు మూడు పెట్టెలు విడిచేసి తర్వాత దాంట్లో పడ్డాను. ముష్టిది

ఇంజన్ పక్క పెట్టెముందు చెయ్యిచాస్తోంది. తర్వాత పెట్టె దగ్గరకొచ్చింది. ఒక ధర్మాత్ముడు బిడ్డచేతిలో నిమ్మతొన లెట్టాడు. నా పెట్టె ముందుకొచ్చింది. మొహం అదోలా పెట్టి చెయ్యిచాచి, నన్నూ అడిగింది. నా మనస్సు బాగైంది; పై కులాలవారి పెత్తన దారిని - అడిగితే ఇస్తాను. అహం పొంగింది. నేను మామూలు మనిషినయ్యాను. ముష్టి మొగుడు గురన్న దీనికేమీ ఇవ్వద్దన్నాడు. ఇవ్వద్దని శాసించేటందుకు వాడెవడు? ఎవరి కివ్వాలో ఎవరి కివ్వకూడదో శాసించేది ఈ ముష్టిముండా మొగుడు వెధవా! అది వాణ్ణి వొదిలేసి, మరొకడితో వుంటోందిట. అది అలా వుంటే నాకేం? వీడు ముసిలాడు - వాడు పడుచువాడు. ఆకలి తీవ్రత వొకటే - భౌతిక శాస్త్రంలో ప్రత్యక్షమయ్యే కాన్‌స్టెంట్ "కె" దాని మందం, వొత్తిడి, వైశాల్యం సమయా సమయాలూ వొక్కటే. ఏకో నిరంజన్! ఎన్నెన్నో మతాలు పరమాత్మ ఒక్కడే.

జేబులో చిల్లరంతా గాలించి పోగుచేస్తె రెండణాలైంది. మొగాడికి కూలిజాస్తి; ఆడదానికి తక్కువ. వాడికి పావలా ఇచ్చాను దీనికిరెండణాలు చాలు. ఇచ్చాను. నవ్వి, సలాంచెప్పి, ముందుకు నడిచింది. భుజాన బిడ్డ, చెయ్యి ఊపుతోంది - పెరిగిపోతూన్న జనాభాకి, యిచ్చిన స్వాగతం! రైలు కదిలింది. గార్డు జండా వూపుతున్నాడు. వూపకముందే కదిలింది రైలు కదిలాక గంట కొట్టారు. ముష్టిది రైలు పెట్టె నంటి పెట్టుకునే నడుస్తోంది.

రైలు వేగం ముదురుతోంది. ముష్టిది పరుగెడుతోంది. ఆగిపోయింది. కిటికీలోంచి తలపైకి పోనిచ్చి చూశాను. ముష్టిదాని ఎదురుగా భర్త గురన్న నిలబడ్డాడు. వొడిలో చీరకొంగు విప్పి, చిల్లరంతా వాడి చేతిలో వేస్తోంది. రైలు మలుపు తిరిగింది. వారింక కనబడ్డంలేదు. ముక్కుపొడుం పీల్చి, బద్ధకం విదిలించుకొన్నట్లు ఫ్యాక్టరీ పొగా, ఇంజన్ పొగా, పీల్చి పీల్చి తూర్పు మేఘం నల్లబడి కదలడం సాగించింది. గురన్న పై కోపం వచ్చింది. అబద్ధం అడాడు. దాని కేదిచ్చినా ప్రియుడి కిస్తుంది - తన కివ్వదు - అని అదే అబద్ధం. సంపాదించిన డబ్బంతా భర్త చేతిలో పొయ్యడం నే స్వయంగా చూశాను. ఆమె చరిత్రలో రాకొమార్తె రాజ్యం బలపరుచుకోవాలని వృద్ధుడికి కట్టబెడతారు. వృద్ధుడు యుద్ధాలలో ఓడిపోయి బికారవుతాడు. పరరాజు యువకుడు. ఆమె ప్రేమిస్తుంది. భర్తని విడిచేసి, ఆ రాజుతో వుండి రాణీ అవుతుంది. భర్త సంపాదన, తన రాజ్యంలో కొన్ని భాగాలు, వృద్ధుడైన ఆ మొదటి భర్తకి ఇచ్చివేస్తూ వుంటుంది. ఈ ముష్టిదీ అంతే. ప్రేమ, కామం - ఇవి ఆ యువకుడిస్తాడు; ఏమీలేని భర్తని తనే పోషిస్తుంది. వింత కథ. కావ్యం అల్లుతారు కవులు. యిది రాణీ కాదు, ముష్టిది. అబద్ధాలాడే భర్త పట్ల ఎంతో ఆదరణ. రైలు క్రమంతో కదుల్తోంది - నా గుండెలో రేగిన లయతో సమన్వయం కుదిరింది కాబోలు కన్నుమూశాను.

రచనాకాలం : **1956**, సెప్టెంబర్ **19 - 27**
ప్రచురణ : యువ - **1956** నవంబర్ - దీపావళి ప్రత్యేక సంచిక